## క్లుప్తంగా

### ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని కలసిన రవికుమార్



ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసిన రవికుమార్

**రావులపాలెం/రాజోలు:** వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ ఉపాధ్యక్షుడిగా గ్రంథం రవికుమార్ నియమితులవడంతో శుక్రవారం ఆయన రావులపాలెం మండలం గోపాలపురం గ్రామంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. గోపాలపురంలోని ఎమ్మెల్యే స్వగృహానికి వచ్చిన ఆయనను జగ్గిరెడ్డి దుశ్శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు.

### విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

**మామిడికుదురు:** మండలంలోని పాశర్లపూడి బాడవ, బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ శుక్రవారం తెలిపారు. జాతీయ రహదారుల విభాగం పనుల్లో భాగంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

### హిమోగ్లోబిన్ పరీక్షలపై ఏఎన్ఎంలకు శిక్షణ

**మామిడికుదురు:** హిమోగ్లోబిన్ పరీక్షల నిర్వహణ ద్వారా శరీరంలో రక్తశాతం వివరాలు తెలుసుకోవడం సులభమవుతుందని మాస్టర్ ట్రినర్లు రేలంగి సుబ్రహ్మణ్యం, ఎ.సాయితేజ చెప్పారు. మామిడికుదురు ఎమ్మార్సీలో శుక్రవారం నగరం, లూటుకుర్రు, నాగుల్లంక, కేశనపల్లి పీహెచ్‌సీలు, రాజోలు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలోని ఏఎన్ఎంలకు హిమోగ్లోబిన్ పరీక్షల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. శరీరంలో 11 శాతం ఉన్నవారు ఆరోగ్యంగా ఉన్నట్లుగా పరిగణించాలన్నారు. 10 నుంచి 10.90 శాతం ఉన్న వారిని తేలికపాటి రక్తహీనత ఉన్నట్లుగా గుర్తించాలని చెప్పారు. అదే విధంగా ఏడు శాతం ఉంటే తీవ్రమైన రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించాలని సూచించారు. రక్తహీనత సమస్యతో బాధపడే వారు పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ వర్కర్ల ద్వారా ఐరన్ మాత్రలు తీసుకోవాలన్నారు. తద్వారా రక్తశాతం పెరుగుదలకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### ఆలయ వార్షికోత్సవం

**అంబాజీపేట:** గంగలకుర్రు శివారు రావులమ్మ పానాటం వద్ద వేంచేసిన రావులమ్మ అమ్మవారి నాలుగో వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆలయాన్ని అరికల రాంబాబు ఆర్థిక సాయంతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జయంతి భాస్కర్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన చేపట్టారు.

### వీరభద్రస్వామి ప్రతిష్ఠ మహోత్సవాలు

**మామిడికుదురు:** పెదపట్నంలంకలో నూతనంగా నిర్మించిన భద్రకాళీ సమేత బాల వీరభద్రేశ్వరస్వామి ప్రతిష్ఠా మహోత్సాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మాఘ శుద్ధ సప్తమి ముహూర్తంలో శిరిగినీడి గోపీనాథ్, హేమజ్యోతి దంపతులు ప్రధాన కర్తలుగా పాల్గొని పలు పూజలు చేశారు. గణపతిపూజ, పుణ్యాహవాచనం, పంచగవ్య ప్రాశన, ఋత్విక్ వరుణ, ప్రధాన మండపారాధన, అఖండ దీపారాధన, అంకురారోపణ, ధ్వజారోహణ, తదితర పూజలను అంగరంగ వైభవంగా జరిపించారు. బ్రహ్మశ్రీ గంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పలువురు భక్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ నెల 18వ తేదీ ఆదివారం ఉదయం 10.42 గంటలకు నూతన ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

### నులిపురుగుల వల్లే రక్తహీనత

**అంబాజీపేట:** మనుషుల్లో నులిపురుగులు ఉండడం వల్ల బలహీనంగా మారి రక్తహీనత ఏర్పడుతుందని జిల్లా మానిటరింగ్ అధికారి ఎ.సూర్యనగేష్ అన్నారు. ఇరుసుమండ, పుల్లేటికుర్రు గ్రామాల్లో వున్న అంగన్‌వాడీ కేంద్రాలు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలు, జెడ్పీ హైస్కూల్లో జరుగుతున్న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ ఎం.రవికుమార్, హెచ్ఎం కేవీఎస్ కనకదుర్గ, ఎంఎల్‌హెచ్ పీఎస్‌లు ఎస్‌కే సైనా, పావని, ఏఎన్ఎం ధనలక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

**ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ పూర్తి**

**ఆలమూరు:** నులిపురుగు నిర్మూలనకు, పౌష్టికాహార లోపం నివారించి రక్తహీనతను రూపుమాపేందుకు ప్రభుత్వం చేపట్టిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ లక్ష్యం పూర్తయింది. ఈనెల తొమ్మిదిన మండలంలో 98 శాతం పూర్తి కాగా శుక్రవారం నిర్వహించిన శిబిరాల్లో వైద్యారోగ్య సిబ్బంది లక్ష్యాలను పూర్తి చేశారు.

### కోడి పందేలపై దాడి

**అయినవిల్లి:** మండలంలోని పోతుకుర్రులో కోడిపందేలు నిర్వహించే స్థావరంపై శుక్రవారం అయినవిల్లి ఎస్సై బి.రాజేష్‌కుమార్ తన సిబ్బందితో కలసి దాడి చేశారు. ఈ దాడిలో ఇరువురిని అదుపులోకి తీసుకుని 8 కోడిపుంజులను స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

# ఆసరాతో మహిళలకు ఆర్థిక భరోసా

- జెడ్పీ చైర్మన్ విప్పర్తి
- నాలుగో విడత చెక్కుల పంపిణీ




పాశర్లపూడిలో డ్వాక్రా సంఘాల మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు

**మామిడికుదురు:** మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారిని ఆదుకోవాలన్న లక్ష్యంతోనే సీఎం జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా ద్వారా వారికి ఆర్థికంగా చేయూతనందిస్తున్నారని జెడ్పీ చైర్మన్, పి.గన్నవరం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ విప్పర్తి వేణుగోపాలరావు పేర్కొన్నారు. పాశర్లపూడిలో శుక్రవారం సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో మండలంలోని 11 గ్రామాలకు చెందిన 887 డ్వాక్రా సంఘాల సభ్యులు 8,870 మందికి వైఎస్సార్ ఆసరా ద్వారా మంజూరైన రూ.7.23 కోట్ల చెక్కును లబ్ధిదారులకు అందించారు. వేణుగోపాలరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం మాదిరిగా మాట తప్పలేదు. మడమ తిప్పలేదు. సాకులు వెతకలేదు. ఇచ్చిన హామీకి అనుగుణంగా నాలుగు విడతల్లో డ్వాక్రా అక్క చెల్లెమ్మల రుణాన్ని మొత్తం మాఫీ చేశారన్నారు. పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ సర్కారుకు, సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలు అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. మళ్లీ జగన్‌ను సీఎం చేయడం ద్వారా మరిన్ని సంక్షేమ పథకాలు పొందాలని వేణుగోపాలరావు అభిలషించారు. వేణుగోపాలరావుతో పాటు డ్వాక్రా మహిళలు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, పీఏసీఎస్ చైర్మన్లు యాళ్ల‌వీవీ సత్యనారాయణ, కటకంశెట్టి ఆదిత్యకుమార్, గెడ్డం కృష్ణమూర్తి, నగరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొమ్ముల సత్యమణి, ఎంపీటీసీ అంకాడి వీరాంజనేయులు, సత్రం చైర్మన్ వాసంశెట్టి రామకృష్ణ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము, జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, గ్రామ శాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

**రాజులపాలెంలో..**

**పి.గన్నవరం:** రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా గెలిపించాలని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. మండలంలోని రాజులపాలెం గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి గ్రామ పెద్దలను, పార్టీ శ్రేణులను, ప్రజలను కలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓట్లేసి తనను గెలిపించాలని కోరారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను విప్పర్తి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌లు కొంబత్తుల ఏసుబాబు, వడలి కొడయ్య, పార్టీ నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్, గుత్తుల మధు, నక్కా గోపి, కొక్కిరి రవికుమార్, మెల్లం మహాలక్ష్మి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రథసప్తమి



వీరవల్లిపాలెం సూర్యనారాయణమూర్తి సత్రంలో రథసప్తమి పూజలు



కొమరాజులంకలో సూర్య భగవానికి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

**అయినవిల్లి:** మండలంలోని వీరవల్లిపాలెంలో ముద్రగెడ నాగయ్య స్థాపించిన సూర్యనారాయణ మూర్తి సత్రంలో మాఘ మాసం శుక్రవారం రథసప్తమి పూజలు జరిపారు. తొలుత గణపతి పూజలు చేశారు. పండితులు ఆధ్వర్యంలో సూర్యనమస్కారాలు, వేదపారాయణ, నవగ్రహ పూజలు చేశారు. ఈ పూజలు వెలవలపల్లి కామేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలో భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామికి ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీ, భూ సమేత రంగనాయక లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయాల్లో అయినవిల్లి, సిరిపల్లి, తొత్తరమూడి, నేదునూరు, విలస తదితర గ్రామాల్లో రథసప్తమి పూజలు జరిపారు.

**రావులపాలెంలో..**

**రావులపాలెం:** మండలలో శుక్రవారం రథ సప్తమిని భక్తులు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్యంగా సూర్యమందిరం ఉన్న కొమరాజులంకలో భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమీప ప్రాంతాల్లో ఎక్కడా సూర్య భగవానికి దేవాలయం లేకపోవడంతో కొమరాజులంకలో ఉన్న సూర్య మందిరానికి సమీప ప్రాంతాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. ఉదయానే సూర్యభగవానుడికి అభిషేకాలు, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతర స్వామివారికి కల్యాణం, శ్రీచక్రస్నానం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు.

## కల్యాణ వేదిక వద్ద ఏర్పాట్లు పరిశీలన



కల్యాణ వేదిక వద్ద ఏర్పాట్లు గురించి ఎమ్మెల్యేకు వివరిస్తున్న ఏసీ సత్యనారాయణ

**సఖినేటిపల్లి:** అంతర్వేదిలో లక్ష్మీనృసింహుని తీర్థ మహోత్సవాలు పురస్కరించుకుని ఈ నెల 19న నిర్వహించే కల్యాణానికి సంబంధించి వేదిక వద్ద ఏర్పాట్లను శుక్రవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు పరిశీలన చేశారు. వేదిక వద్ద వీఐపీ గ్యాలరీలు, ఇతర గ్యాలరీల ఏర్పాట్ల గురించి అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ వివరించారు. అలాగే సాధారణ భక్తులకు కల్యాణం వీక్షించేందుకు అవసరమయ్యే స్క్రీన్‌ల ఏర్పాటు గురించి కూడా ఎమ్మెల్యే, ఏసీ సత్యనారాయణకు సూచనలు చేశారు. అలాగే కల్యాణం భక్తులు అందరూ వీక్షించేలా చూడాలని ఏసీ సత్యనారాయణకు, ఎమ్మెల్యే తెలిపారు. వెంట చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారరామగోపాల రాజా బహద్దూర్, నాయకులు కేఎస్ఎన్ రాజు, ముప్పర్తి త్రిమూర్తులు పాల్గొన్నారు.

## పీచు బొమ్మలకు 'లేపాక్షి'తో మార్కెటింగ్



పాశర్లపూడిలో కొబ్బరి పీచు బొమ్మలను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి

**మామిడికుదురు:** హస్త కళలు దేశానికి వెన్నెముక లాంటివని వాటిని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్‌పర్సన్ బి.విజయలక్ష్మి పేర్కొన్నారు. పాశర్లపూడిలోని కొబ్బరిపీచు బొమ్మల కేంద్రం గ్రామ దుకాన్‌ను ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ కోనసీమ అనగానే కేరళ అందాలు గుర్తుకు వస్తాయన్నారు. ఇక్కడి మహిళా హస్త కళాకారులు కొబ్బరి పీచుతో తయారు చేసిన పలు రకాల బొమ్మలు అద్భుతంగా ఉన్నాయన్నారు. వీటిని తయారు చేసిన కళాకారులను ఆమె అభినందించారు. దేశ వ్యాప్తంగా 20 లేపాక్షి ఎంపోరియంలు ఉన్నాయని, వాటి ద్వారా హస్త కళాకారులు తయారు చేసిన బొమ్మలను విక్రయించి మహిళా కళాకారులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కోనసీమ క్వాయర్ టాయ్స్‌కు లేపాక్షి ఎంపోరియంల ద్వారా మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఆమె వెంట జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.చంద్రమౌళి, మొల్లేటి తలుపుల రాజా, ప్రసాద్, మునిరెడ్డి పాల్గొన్నారు.

## సీఎం జగన్‌ను ఆశీర్వదించండి



కముజువారిలంకలో మాట్లాడుతున్న పార్టీ మండల శాఖ అధ్యక్షుడు శేఖర్

**అంబాజీపేట:** ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించిన సీఎం జగన్‌మోహన్ రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలిచి మరోసారి సీఎం చేసేందుకు ఆశీర్వదించాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల ఉపాధ్యక్షుడు విప్పర్తి నిఖిల్‌కృష్ణ అన్నారు. కముజువారిలంక, చిరుతపూడి గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు విత్తనాల శేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం పార్టీ సమావేశాలు నిర్వహించారు. వెంకటేశ్వరరావు, వరలక్ష్మి, నిఖిల్‌కృష్ణలతో పాటు పార్టీ మండలశాఖ అధ్యక్షుడు శేఖర్ మాట్లాడుతూ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. గ్రామ స్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. నూతనంగా మండల శాఖ అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు స్వీకరించిన విత్తనాల శేఖర్‌ను పార్టీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచులు సరస్వతుల సుబ్రహ్మణ్యశాస్త్రి, కోట బేబీరాణి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, జిల్లా రైతు విభాగం ఉపాధ్యక్షుడు కొర్లపాటి కోటబాబు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, వాసంశెట్టి వెంకటశెట్టి, గుత్తుల వెంకటేశ్వరరావు, మైలే ఆనందరావు, వాసంశెట్టి పెదబాబు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి పెద్దపీట



క్రీడా మైదానం అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు

**అయినవిల్లి:** సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లోని క్రీడా ప్రాంగణాల అభివృద్ధికి పెద్దపీట వేశారని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండలంలోని ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్పోర్ట్స్ అథారిటీ డిపార్ట్‌మెంట్ నిధులు రూ.5 లక్షలతో క్రీడామైదానం అభివృద్ధి పనులకు జెడ్పీటీసీ భూమి పూజ చేశారు. క్రీడా మైదానంలో ఈ నిధులతో వాలీబాల్ కోర్టు, షటిల్ కోర్టు, కోకో, బాస్కెట్‌బాల్ కోర్టు, లాంగ్‌జంప్, హైజంప్ కోర్టుకు పనులకు జెడ్పీటీసీ శ్రీనివాసరావు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, ఎంపీటీసీ యడ్ల కిరణ్‌బాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.గణేశ్వరరావు, వ్యాయామోపాధ్యాయుడు రమేష్, వెంకట్రావు, ఎస్ఎస్ఏ ఇంజినీరింగ్ అసిస్టెంట్ వార నాగేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు

మంత్రి పినిపే విశ్వరూప్

**అమలాపురం రూరల్:** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి, విద్యార్థుల ఉన్నత భవితకు బాటలు వేసిందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. శుక్రవారం రథసప్తమి సందర్భంగా బండారులంక జెడ్పీ హైస్కూల్లో శ్రీనివాసా బాలమిత్ర సంఘం ఆధ్వర్యంలో జరిగిన సరస్వతీదేవి పూజకు ఎంపీ చింతా అనురాధతో కలసి మంత్రి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒక మేనమామలా ఉంటూ వారు ఉన్నత శిఖరాలు అధిరోహించేలా అనేక పథకాలు అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారన్నారు. ఇంగ్లిష్ మీడియం విద్యను విద్యార్థులకు చేరువ చేశారన్నారు. మరో నాలుగు, ఐదేళ్లలో వాటి ఫలితాలు పుష్కలంగా వస్తాయన్నారు. తద్వారా ఈ ప్రాంతం నుంచి సివిల్ సర్వీసెస్‌కు వెళ్లే విద్యార్థుల సంఖ్య పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎంపీ చింతా అనురాధ మాట్లాడుతూ భావిభారత పౌరులను తీర్చిదిద్దిందుకు అమ్మ ఒడి, జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన వంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక బండారులంక హైస్కూల్ ప్రగతి దిశగా పరుగులు తీసిందన్నారు. ఏఎంసీ చైర్మన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి, డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి వెంకటేశ్వరబాబు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మెన్ షేక్ అబ్దుల్ ఖాదర్, వైస్ ఎంపీపీ పాలమూరి బాలకృష్ణ, రాష్ట్ర చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి జాన గణేష్, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు కాలెపు శ్రీనివాసరావు, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ పెదపూడి బాబూరావు, శ్రీనివాసా బాలమిత్ర సంఘం ప్రతినిధులు అంకం పెదరాజు, కడలి రాజు తదితరులు పాల్గొన్నారు.

## పౌరులందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి




కొత్తపేటలో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న ఆర్డీవో సత్యనారాయణ

**కొత్తపేట:** ప్రజలకు రాజ్యాంగం కల్పించిన ఆయుధం 'ఓటు' అని, ఆ హక్కును నిజాయితీగా వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్య విలువను కాపాడాలని స్థానిక ఆర్డీవో జీవీవీ సత్యనారాయణ సూచించారు. రానున్న అసెంబ్లీ, లోక్‌సభ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం స్థానిక శతాబ్ది డిగ్రీ కళాశాలలో నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో సత్యనారాయణ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ కట్టా నాగమోహన్ అధ్యక్షతన ఓటు హక్కు పొందడం, ఈవీఎంలలో ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ఆర్డీవో మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు అని అన్నారు. ప్రపంచంలోనే భారతదేశం అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమన్నారు. ఈ ఏడాది జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలన్నారు. వంద శాతం పౌరులు ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఓటు వినియోగంలో నిజాయితీగా సరైన వ్యక్తిని ప్రజాప్రతినిధిగా ఎన్నుకోవాలని సూచించారు. ఓటు విధిగా వినియోగించుకునే విషయంలో మీరే కాకుండా మీ ఇరుగు పొరుగు వారిని కూడా చైతన్యవంతులను చేయాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో ఆర్డీవో నిజాయితీగా ఓటు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ సదస్సులో తహసీల్దార్ జి.ఎలీషా, డీటీ ఎన్.శ్రీనివాస్, ఆర్ఐ కొప్పిశెట్టి ఏడుకొండలు, వీఆర్‌ఓ వీరేంద్ర, ఈవీఎం మాస్టర్ ట్రైనీ పి.సంతోష్, సీనియర్ అధ్యాపకులు వులుసు సుబ్బారావు, జి.శ్రీనివాస్, జి.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ పారిశుధ్య చర్యలు పాటించాలి



ఆలమూరులో డ్రైడే నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

**ఆలమూరు:** గ్రామీణ ప్రాంతాల్లో సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పేందు వీలుగా ప్రతి శుక్రవారాన్ని పొడి వారం (డ్రైడే)గా పాటించి సంపూర్ణ పారిశుధ్యం నెలకొల్పాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.మల్లికార్జున, పి.భవానీశంకర్ కోరారు. ఫ్రైడే సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఆరోగ్య, ఆశ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఇంట్లో నిల్వ నీరు ఉండకుండా తీసుకోవలసిన చర్యలను వివరించారు. రుబ్బురోళ్లు, కొబ్బరి చిప్పలు, ఖాళీ సీసాలు, వ్యర్థాలను ఇంట్లో ఉండకుండా చూడాలని మహిళలకు సూచించారు. దీని వల్ల క్రిమి, కీటకాలు దరిచేరవని, తద్వారా అంటు వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉండదన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి మెరుగైన ఆరోగ్యకర సమాజాన్ని నెలకొల్పాలని ప్రజలను కోరారు. వివిధ గ్రామాల్లో ఆరోగ్య, ఆశ సిబ్బంది ఫ్రైడేను వివరిస్తూ భారీ ర్యాలీలు నిర్వహించారు. సీహెచ్‌ఓ పి.రాధాకృష్ణ, ఎంపీహెచ్‌ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలమణి తదితరులు వైద్యసేవలను పర్యవేక్షించారు.

### క్రైస్తవులపై దాడి చేసిన వారిని శిక్షించాలి

**రాజోలు:** తెలంగాణలోని జవ్వాద గ్రామంలో చర్చిపై దాడి చేసి క్రైస్తవులను గాయపర్చిన దుండగులను వెంటనే శిక్షించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్ ఎం.పాల్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. దళిత క్రైస్తవుల దాడులను సంఘ నాయకులు తీవ్రంగా ఖండించారు. దళిత క్రైస్తవులకు రక్షణగా ప్రత్యేక చట్టాలను ప్రభుత్వాలు తీసుకురావాలని డిమాండ్ చేశారు. మండల ఉపాధ్యక్షుడు పాలమూరి శ్యాంబాబు, నాయకులు బత్తుల మురళీకృష్ణ, చిలకపాటి శ్రీధర్, చుట్టుగుళ్ల సత్యనారాయణ, జిల్లెళ్ల వినోద్, తెన్నేటి బాబురావు, దొండపాటి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులకు చిరుధాన్యాలతో స్నాక్స్

**యానాం:** నియోజకవర్గంలోని వివిధ ప్రభుత్వ, జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు చిరుధాన్యాలతో తయారు చేసిన స్నాక్స్ పథకాన్ని వారానికి రెండు సార్లు ఇవ్వాలని నిర్ణయించారు. శుక్రవారం డిప్యూటీ డైరెక్టర్, మిడ్డేమీల్స్ టి.కొంజు మోజీకుమారన్ ఆదేశాలు జారీ చేశారని విద్యాశాఖాధికారి తెలిపారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందిస్తున్న జెడ్పీటీసీ ప్రసన్నకుమారి

**మలికిపురం:** క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్న చింతలమోరి గ్రామానికి చెందిన కొల్లు వెంకట నాగేంద్రకు మంజూరైన సీఎం సహాయ నిధి రూ.2.40 లక్షల చెక్కును జెడ్పీటీసీ బళ్ల ప్రసన్నకుమారి అందజేశారు. విజయవాడలో చికిత్స పొందుతున్న నాగేంద్రకు వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ మిథున్‌రెడ్డి సమక్షంలో చెక్కును పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఎంతో మంది నిరుపేదలకు ఉచితంగా చికిత్స అందుతుందన్నారు. పార్టీ నాయకుడు బళ్ల రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

### క్షతగాత్రుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయాన్ని అందిస్తున్న శెట్టిబలిజ సంఘ నాయకులు

**రాజోలు:** రోడ్డు ప్రమాదంలో గాయపడి మంచానికే పరిమితమైన తాటిపాక మంగెన గంగయ్యకాలనీకి చెందిన దొమ్మేటి మణిదీప్‌కు శుక్రవారం రూ.48,500 ఆర్థిక సాయాన్ని అందజేశారు. రాజోలు తాలూకా శెట్టిబలిజ సంఘం, తాటిపాక శ్రీరామ శెట్టిబలిజ సంఘం సంయుక్తంగా ఈ ఆర్థిక సాయాన్ని సమకూర్చారు. ఆర్థిక సాయం అందజేసిన సంఘ సభ్యులకు మణిదీప్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. సంఘ నాయకులు గుబ్బల మనోహర్, గుబ్బల బాబ్జి, బొంతు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### నాలుగో రోజుకు చేరిన దీక్షలు

**అయినవిల్లి:** మండలంలోని పోతుకుర్రులో జగనన్న లేఅవుట్‌లో పనులకు చెందిన బిల్లులు, వేతనాలు చెల్లించాలని కూలీలు, ట్రాక్టర్, పొక్లెయినర్ల యజమానులు చేపట్టిన దీక్షలు శుక్రవారానికి నాలుగో రోజుకు చేరుకున్నాయి. వీరికి టీడీపీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. బాధితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

**కొత్తపేటలో రెండో రోజుకు..**

**కొత్తపేట:** రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగులకు గత ఐదేళ్లుగా చెల్లించవలసిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ జేఏసీ కొత్తపేట తాలూకా నాయకులు రెండోరోజు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏపీ జేఏసీ దశలవారీ ఉద్యమ కార్యాచరణలో భాగంగా శుక్రవారం సాయంత్రం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తాలూకా జేఏసీ అధ్యక్షుడు మోటూరి రామారావు ఆధ్వర్యంలో జేఏసీ నాయకులు, ఉద్యోగుల నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియచేస్తూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి ఎన్వీ రామారావు, తాలూకా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు ఏడిద సత్తిరాజు, యూటీఎఫ్, ఎస్టీయూ, పంచాయతీరాజ్ యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

### వైఎస్సార్, జగన్ ప్రభుత్వాల్లోనే మైనార్టీల సంక్షేమం



షేక్ ఖాజాబాబు

**కొత్తపేట:** రాష్ట్రంలో ముస్లిం, మైనార్టీలకు నాడు వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వంలో, నేడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చి సంక్షేమ పథకాలు అమలు చేశారని జిల్లా వైఎస్సార్ సీపీ ముస్లిం మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడు షేక్ ఖాజాబాబు అన్నారు. ఇటీవల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ముస్లిం, మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ 2,242.36 కోట్లు కేటాయింపులు చేయడంతో ముస్లింల, మైనార్టీ వర్గాల్లో సీఎం జగన్, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై మంచి అభిప్రాయం వ్యక్తమైంది. ఖాజాబాబు ఆధ్వర్యంలో పలువురు ముస్లిం నాయకులు గత, ప్రస్తుత ప్రభుత్వ నిధుల కేటాయింపులపై చర్చించుకున్నారు. కాజాబాబు మాట్లాడుతూ నాడు రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ముస్లిం మైనార్టీలకు ప్రత్యేక రిజర్వేషన్లు కేటాయించి గుర్తింపు తీసుకువచ్చి, సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో ముస్లిం, మైనార్టీలు అందరూ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలిచి, ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని కాజాబాబు అన్నారు.